క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల ధర్నా

రామచంద్రపురం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐటీయూసీ నేతృత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి స్థానిక మున్సిపల్ కార్మికులు శనివారం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కార్యాలయ అధికారులకు అందించారు. ఏఐటీయూసీ నేతలు పి.రాము, బి.సత్యనారాయణ, తిరుమలరావు, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండపేటలో యూటీఎఫ్ జిల్లా మహాసభ

మండపేట: యూటీఎఫ్ జిల్లా మహాసభను ఆదివారం మండపేటలో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి హాజరవుతారన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, డీవీ రాఘవులు, జ్యోతిభట్టు తదితరులు పాల్గొని భవిష్యత్తు కార్యాచరణపై సూచనలిస్తారన్నారు. జిల్లా మహాసభలో భాగంగా ఉపాధ్యాయ చైతన్య, విద్య చైతన్య సదస్సులు, జిల్లా నూతన కౌన్సిల్ ఎన్నిక జరుగుతాయని గోపాల కృష్ణారెడ్డి తెలిపారు.

159 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ఫ్యామిలి ఫిజీషియన్ వైద్య సేవా కార్యక్రమంతో క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని అంగర పీహెచ్‌సీ డాక్టర్ జె.అనూష ప్రియాంక అన్నారు. తాతపూడిలో శనివారం అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో 159 మంది రోగులను ఆమె పరీక్షించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. సీజనల్ వ్యాధుల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. శిబిరాన్ని సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుక వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ జి.సూర్యనారాయణ, కార్యదర్శి మోహన్ సందర్శించారు.

పట్టణ సచివాలయ కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం



రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల కన్వీనర్‌గా సూరంపూడి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులను జారీ చేశారు. సచివాలయ పరిధిలోని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని సుబ్రహ్మణ్యం స్థానిక విలేకరులకు తెలిపారు.

వాహనాలకు బహిరంగ వేలం

మండపేట: మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం, సారా అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలకు శనివారం ఇప్పనపాడులోని రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 10 వాహనాలకు గాను వాటిలో ఆరు మోటారు సైకిళ్లు, మూడు స్కూటర్లు, ఒక ఆటో ఉన్నాయి. రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి సమక్షంలో రూరల్ సీఐ పి.శివగణేష్, ఎస్‌ఐ బి.శివకృష్ణ వేలాన్ని పర్యవేక్షించారు. ఆరు వాహనాలను రూ. 89760 పాటదారులు దక్కించుకున్నారు. మిగిలిపోయిన నాలుగు వాహనాలకు త్వరలో మరోమారు వేలం నిర్వహించనున్నట్టు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు.

గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా నాగరాజు



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా వెలంపాలెంకు చెందిన మాజీ ఎంపీటీసీ, వెలంపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పలివెల నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ క్యాంపు కార్యలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

రాయవరం: మండలంలోని వెదురుపాకకు చెందిన చెందిన నొక్కి చోడియ్య చిన్న కుమార్తె మేరీ అనే యువతి అదృశ్యమైనట్టుగా అందిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మేరీ ఈ నెల 23న కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు తండ్రి చోడియ్య లేచి చూడగా, కుమార్తె ఇంట్లో కనిపించలేదు. 23 ఏళ్ల వయసున్న మేరీ ఆచూకీ కోసం తండ్రి చోడియ్య, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో కూలి మృతి

కడియం: ఇనుప నిచ్చెనను పైకిలేపే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మండపేట మండలం మోర్సిపాడు గ్రామానికి చెందిన కప్పల నవీన్ (38) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్సిపాడుకి చెందిన నవీన్ బుర్రిలంకలోని సదాశివ నర్సరీలో పనులు చేస్తుంటాడు. శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇనుప నిచ్చెనను పైకి లేపే సమయంలో త్రీఫేజ్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ తిలక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన ఫలితాలకు మెటీరియల్ పంపిణీ

- జెడ్పీ సౌజన్యంతో రూపకల్పన
- రెండు నియోజకవర్గాల్లో 4,494 మంది టెన్త్ విద్యార్థులకు లబ్ధి

కపిలేశ్వరపురం: చదువుకునే విద్యార్థికి సకల సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. సెలవులు ముగిసేసరికి పాఠశాల భవనాలను సుందరంగా తీర్చిదిద్దింది. చదువులు నాణ్యతతో చదవాలని ఇప్పుడు జగనన్న విద్యాభారతి పథకం పేరుతో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తుంది. జిల్లా పరిషత్ సౌజన్యంతో రూపకల్పన చేసిన మెటీరియల్ ఇప్పటికే విద్యార్థులకు చేరాయి. మెటీరియల్ తమకెంతో ప్రయోజనకారిగా ఉందంటూ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న విద్యా భారతి పథకం లక్ష్యమిదీ..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 64 జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లోని 4,494 మంది పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. 2022–23 విద్యా సంవత్సరంలోని పదో తరగతి విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్‌ను జిల్లా పరిషత్ సమకూర్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 480 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రూ.1.20 కోట్ల ఖర్చుతో 48,727 వేల స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బాలురు 7,381 మంది, బాలికలు 7,372 మొత్తం 14,753 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

మెటీరియల్ ప్రత్యేకత ఇదీ..

ఎస్‌సీఈఆర్‌టీ గుర్తింపు పొందిన నిపుణులైన ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులతో జగనన్న విద్యా భారతి మెటీరియల్‌ను రూపొందించారు. ప్రశ్నలు–జవాబులు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో సరళమైన విధానంలో రూపొందించడంతో సులభంగా అర్థమయ్యేట్టు ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థులు అంటున్నారు.

రెండు నియోజకవర్గాల్లో మెటీరియల్ పంపిణీ ఇలా...

మండలం	జెడ్పీ హైస్కూళ్లు	పుస్తకాలు పొందిన విద్యార్థినీవిద్యార్థులు
రామచంద్రపురం	15	1,107
కె.గంగవరం	10	525
కాజులూరు	11	720
మండపేట	12	1,048
రాయవరం	08	499
కపిలేశ్వరపురం	08	595
మొత్తం	64	4,494



జగనన్న విద్యాభారతి మెటీరియల్ పుస్తకాలతో నల్లూరు పాఠశాల విద్యార్థులు

సారాంశం సింపుల్‌గా అర్థమయ్యేలా ఉంది



విద్యా సంవత్సరం ప్రారంభం కాలం నుంచి వింటూ ఉన్న పాఠ్యాంశాల సారాంశం మొత్తం చాలా సింపుల్‌గా పొందుపర్చినట్టుగా మెటీరిల్ ఉంది. చదివేందుకు అనువుగా ఉంది.

– బి.సాయితేజ, పదో తరగతి విద్యార్థి, వల్లూరు

మంచి మార్కులకు దోహదం



జగనన్న విద్యాభారతి మెటీరియల్ మంచి మార్కులను సాధించేందుకు అనువుగా ఉంది. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను మరోసారి పునశ్చరణ చేసుకునేలా మెటీరియల్ ఉపకరిస్తుంది.

– బి.దివ్య, పదో తరగతి విద్యార్థిని, వల్లూరు

స్టడీ మెటీరియల్ పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను శనివారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ వై.లక్ష్మణకుమార్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేపడుతున్న చర్యలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి

మండపేట: మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మండలంలోని ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. అందులో భాగంగా గ్రామంలో డ్రైన్లలో పేరుకుపోయిన పూడిక తీయడం, డ్రైన్ల పక్కన పెరిగిన గడ్డిని తొలగించి మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డ్రైన్లలో ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్ చేయించనున్నట్టు సర్పంచ్ ఆశీర్వాదం తెలిపారు. రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ నాయకులు, అధికారుల సహకారంతో గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

జాతీయ బాల్‌బాడ్మింటన్ పోటీలకు సింధు



సింధు

రాయవరం: వెదురుపాకకు చెందిన నల్లా సింధు జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టరు ఎస్.కృష్ణప్రసాద్ శనివారం విలేకరులకు తెలిపారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సింధు ఈ నెల 23,24,25 తేదీల్లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి మెరుగైన ప్రదర్శన కనబర్చింది. దీంతో ఆమె రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుంది. సింధును సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, పీఎంసీ చైర్మన్ సీహెచ్.సత్యనారాయణ, హెచ్‌ఎం వి.శాంతిసునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెంటూరులో గడప గడపకూ..



వెంటూరులో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రజల ముంగిటకే పాలన అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వెంటూరులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి రవికుమార్, రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ డైరెక్టర్ వాసంశెట్టి అనంతలక్ష్మితో కలిసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గ్రామంలో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా కుల,మత,వర్గ విభేదాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పింఛన్ కోసం గంటల తరబడి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి మనఃస్ఫూర్తిగా ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణా పుల్లేష్, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- మంత్రి వేణు
- పట్టణంలో గడప గడపకూ..



రామచంద్రపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ సచివాలయం ఏరియాలో శనివారం గడప గడపకూ కార్యక్రమాన్ని మంత్రి వేణు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన లబ్ధి వివరాలను వారికి తెలియజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలుంటే అధికారులతో చర్చించి సత్వర చర్యలకు ఆదేశాలు జారీచేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రతి ఇంటికి, అర్హత ఉన్న లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. నవరత్న పథకాల ద్వారా ప్రజల కష్టాలను తీర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రైతులను ఆదుకునే విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు వంటి వాటిని సకాలంలో ప్రభుత్వం అందిస్తుందని మంత్రి తెలిపారు. అమ్మ ఒడి, సున్నావడ్డీ, ఆసరా, పింఛన్, కాపు నేస్తం తదితర సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పురపాలక పరిధిలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని మంత్రి వేణు ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ బొక్కా సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కంచుమర్తి బాబూరావు, కుడిపూడి గణేష్, కొండేపూడి సురేష్, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



భీమేశ్వరాలయంలో మంత్రి వేణుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈఓ

రామచంద్రపురం రూరల్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మంత్రి వేణుకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఈఓ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు నరేన్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, రామచంద్రపురం పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, దేవదాయ శాఖ జిల్లా అధికారి ఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



బీసీ సంక్షేమ హాస్టల్లో ఆహారాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. 24వ వార్డులోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను మంత్రి వేణు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో అన్ని గదులను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలు తయారు చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. వండుతున్న అన్నాన్ని పరిశీలించారు. హాస్టల్లో బాత్‌రూమ్స్ పరిసరాలు తనిఖీ చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని హాస్టల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు నిద్రించే నివాస గదులు, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఓరుగంటి రామకృష్ణ సూచించారు. మండలంలోని సత్యవాడలో శనివారం పామర్రు పశు వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు కన్పిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలన్నారు. అలసత్వం చూపిస్తే వ్యాధి ముదిరి పశువులకు ప్రాణాపాయం కలుగుతుందని హెచ్చరించారు. అనంతరం పశువైద్యురాలు మోటుపల్లి బిందు గ్రామంలో 57 పశువులకు ఉచితంగా చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. రామచంద్రపురం నియోకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణశాల సిబ్బంది మల్లీశ్వరి పశువుల పేడ, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, నాయకులు సలాది అర్జునరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: మండలంలోని శివల ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు తదితరులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా సుమారు రూ. 63 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు వంటషెడ్డు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని ఇప్పటికే నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిందన్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చొరవతో పాఠశాలకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. సర్పంచ్‌లు అనుసూరి సాయి, పిల్లి రాంబాబు, వ్యవసాయ సలహా కమిటీ మండల అధ్యక్షుడు ఇళ్ల సూర్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల విడుదలకు కృషి చేస్తా

రాయవరం: కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా 25 శాతం నిధుల విడుదలకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హామీ ఇచ్చారు. వెంటూరులో జరుగుతున్న గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా కోనసీమ రైల్వే సాధన సమితి జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు నాయకత్వంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులకు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బి.ఆశీర్వాదం, డాక్టర్ ఎం.నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, రంకిరెడ్డి శ్రీనివాసరావు, కరాటం ప్రవీణ్, పొట్టి వరప్రసాద్ ఉన్నారు.

ఘనంగా రథసప్తమి



గొల్లపాలెంలో సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలలో శనివారం రథసప్తమి పూజలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. రథసప్తమి రోజు నుంచే వేసవి ప్రారంభమౌతుందని హైందవ భక్తుల విశ్వాసం. ఈ రథసప్తమి రోజున సూర్యభగవానుడు కొత్త రథాలను సిద్ధం చేసుకుని తన పయనాన్ని ప్రారంభిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఈ రోజు ఆరుబయట తులసి కోట వద్ద సూర్యభగవానుని చిత్రపటాన్ని ఉంచి పండ్లు, ఫలహారాలు నైవేద్యం పెట్టి ఆయనకు పూజలు నిర్వహిస్తారు. చిక్కుడు కాయలతో చేసిన రథాన్ని మండపం చుట్టూ తిప్పుతారు. అనంతరం సమీప ఆలయాలకు వెళ్లి స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఫిబ్రవరి 1న జనార్దనుని రథోత్సవం

మండపేట: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి గోపాలకృష్ణాచార్యులు తెలిపారు. 31న స్వామివారి కల్యాణం, ఫిబ్రవరి 1న రథోత్సవం, 2న నిత్యహోమం, 3న సదస్యం, 4న చోరోత్సవం, 5న చక్రస్నానం, 6న పుష్పయాగం జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 1మధ్యాహ్నం 2.15 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభిస్తారని, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తదితరులు హాజరవుతారన్నారు.

రాయవరం మండలంలో..

రాయవరం: సూర్యనారాయణస్వామి పుట్టిన రోజైన రథ సప్తమిని శనివారం మండలంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు మహిళలు సంప్రదాయబద్ధంగా రథసప్తమి వేడుక నిర్వహించి ముత్తైదువులకు తాంబూలాలు అందజేశారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో మహిళలు రథ సప్తమిని వేద పండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠంలోని దినకరుడికి గోక్షీర, నారికేళ, ఫలోదక అభిషేకాలు చేశారు. పీఠంలోని భాస్కరుడికి సూర్య నమస్కారాలు, అరుణహోమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథ సప్తమిని పురస్కరించుకుని పీఠంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



శ్రీదేవి భూదేవీ సమేత జనార్దనస్వామి వారు

108 సూర్య నమస్కారాల పోటీలు

రథ సప్తమిని పురస్కరించుకుని లొల్ల గ్రామానికి చెందిన విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం108 సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఈ విషయాన్ని విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి విలేకరులకు తెలిపారు. లొల్ల, రాయవరం గ్రామాల్లోని పాఠశాలలతో పాటుగా దేశ వ్యాప్తంగా ఉన్న విశ్వమానవత సంస్థల ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 108 సూర్య నమస్కారాల పోటీలను నిర్వహించగా, ఐదు వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఆన్‌లైన్ జూమ్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.


పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. విజయదుర్గా పీఠంలో సేవా సమితి ప్రతినిధులు గాదె సత్య వెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. చదువులో ప్రతిభ కనబర్చిన 10 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, సేవా సమితి ప్రతినిధి బలిజేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.

బోన్‌మ్యారో బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న బాబీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

కాజులూరు: మంజేరులో బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న పలివెల రియన్ జస్వంత్ కుటుంబీకులకు ఆర్యావటంకు చెందిన బాబీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. నాలుగేళ్ల పలివెల రియన్‌జస్వంత్ బోన్‌మ్యారో వ్యాధికి గురవడంతో ఆపరేషన్ నిమిత్తం రూ.25 లక్షలు అవసరమౌతుందని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని విషయం తెలుసుకున్న బాబీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు శనివారం సంస్థ 23వ వార్షికోత్సవం పురస్కరించుకుని రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. వార్షికోత్సవంలో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలైన వారికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు చందాల వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మండల గ్రామాల్లో 23 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆటలపోటీలు, టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామన్నారు. పలువురి దాతల నుంచి మరిన్ని విరాళాలు సేకరించి రియన్ జస్వంత్ కుటుంబీకులకు త్వరలో అందజేస్తామన్నారు. ఎలు గ్రామాలకు చెందిన పలు విద్యాసంస్థల అధినేతలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, పలు స్థానిక యువజన, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.